గాయత్రీదేవి నమో స్తుతే..!

• గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు • కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు


న్యూ రామాలయంలో శ్రీ వైష్ణవి దేవీగా..


జైస్వాల్‌గార్డెన్‌లో గాయత్రీదేవీ అలంకరణలో అమ్మవారు


పటేల్‌నగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి


చిక్కడపల్లిలో అన్నపూర్ణదేవి అవతారంలో..


అన్నపూర్ణ దేవీ అలంకరణలో..


గాయత్రీదేవి అలంకారంలో..


ఆంజనేయస్వామి దేవాలయంలో...


కట్టమైసమ్మ ఆలయంలో..


పూజలు చేస్తున్న ఈవో ఎం.దేవనాథం తదితరులు


శంకరమఠంలో కౌమారిగా శారదాంబ

చిక్కడపల్లి : వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవాలయంలో భువనేశ్వరీ దేవి గాయత్రీదేవి అలంకారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అభిషేకం, కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చన తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఈవో ఎం.దేవానాథం, అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి, బీఆర్‌ఎస్ నాయకులు ఎం.రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, రవిశంకర్ గుప్తా, ప్రశాంత్ బల్లా, వంశీ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో జరిగిన అమ్మవారి మండపంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు పూజలందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకులు ఇ.కాశీనాథశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

అంబర్‌పేటలో శనివారం శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే జైస్వాల్ గార్డెన్‌లో మైసమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

నల్లకుంటలో..

శారదా శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం నల్లకుంటలోని శంకరమఠం భక్తి పారవశ్యంతో పులకించిపోతోంది. శనివారం శారదాంబ 'కౌమారి' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శక్తి గణపతి, చంద్రమౌళీశ్వర స్వామికి ఆదిపూజలు నిర్వహించారు. అనంతరం శారదాంబకు విశేష పూజలు, అర్చనలు చేశారు.

న్యూరామాలయంలో శ్రీవైష్ణవి దేవిగా జ్ఞానసరస్వతి..

న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో శనివారం జ్ఞాన సరస్వతి మాత 'శ్రీవైష్ణవి దేవి' అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలి

కాచిగూడ: రాష్ట్రంలో 10 బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్, రజక ఫెడరేషన్, వడ్డెర ఫెడరేషన్, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్, వాల్మీకి ఫెడరేషన్, భట్రాజు ఫెడరేషన్, మేధర ఫెడరేషన్, కృష్ణ, బలిజ, పూసల ఫెడరేషన్, సగర - ఉప్పర ఫెడరేషన్, కుమ్మరి- శాలివాహన ఫెడరేషన్‌లను కార్పొరేషన్లుగా మార్చి, ప్రతి కార్పొరేషన్‌కు రూ.వేయి కోట్లు బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్పొరేషన్ల ద్వారా ఆయా కులవృత్తులకు ఆర్థికసాయం అందించాలని కోరారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా సందీప్‌గౌడ్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన యాదగిరి సందీప్‌గౌడ్‌ను ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధానకార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రోహిన్‌రెడ్డి శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అదిష్టానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తానని తెలిపారు. టీపీసీసీ సోషల్ మీడియా ఎం.రాజ్‌కిరణ్, సీనియర్ కాంగ్రెస్ నేత కోట్ల కిరణ్ పాల్గొన్నారు.

'మావోయిస్టులను చంపడం కాదు.. శిక్షించాలి'

ముషీరాబాద్: మావోయిస్టులను చట్టం ప్రకారం అరెస్టు చేసి విచారణ ద్వారా శిక్షించడానికి బదులు చంపడం రాజ్యాంగ వ్యతిరేకమని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు 32 మందికిపైగా మావోయిస్టులను కాల్చి చంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో పోలీసు ఎన్‌కౌంటర్‌లో 180 మందికి పైగా మావోయిస్టులను కాల్చి చంపడం బాధాకరమన్నారు. ఈ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని, హత్యాకాండకు పూనుకోవడం దుర్మార్గపు చర్య అని ఆయన పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న కాలేరు వెంకటేష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లతో పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఎంతో భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌వో సంధ్యారాణితోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు వక్ఫ్ బోర్డు స్థలాన్ని కేటాయించాలి

ముషీరాబాద్: ముస్లిం శ్మశానవాటికల కోసం 125ఎకరాల వక్ఫ్ బోర్డు స్థలాన్ని కేటాయించాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎంఏ సిద్ధిఖీలతో కలిసి ఏఐసీసీ సెక్రటరీ, పార్లమెంట్ సభ్యులు పి.విశ్వనాథన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లాలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముక్తార్ హుస్సేన్ మాట్లాడుతూ నగరంలో ముస్లిం మైనార్టీలకు శ్మశాన వాటికలు తక్కువగా ఉన్నాయని ఎవరైనా చనిపోతే వారికి దహన సంస్కారాలు చేయడానికి స్థలం కరువైందని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం శ్మశానవాటికల సమస్యలపై దృష్టిసారించాలని కోరారు.

జర్నలిస్టులను మభ్య పెట్టొద్దు


రావికంటి శ్రీనివాస్

చిక్కడపల్లి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఇప్పిస్తామంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక జర్నలిస్టు యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ఖండించింది. శనివారం రాత్రి చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టలను మభ్యపెట్టి పక్కదారి పట్టించేందుకు ఆ యూనియన్ చేస్తున్న చర్యలను డబ్ల్యూజేఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. యూనియన్ చేస్తున్న అనధికార కార్యకలాపాలకు మీడియా అకాడమీ చైర్మన్ మద్దతు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. గతకొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాల దరఖాస్తుల పేరుతో జర్నలిస్టులను అయోమయానికి గురి చేస్తున్నారని, యూనియన్ పేరుతో దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమాచార శాఖ ద్వారా ప్రక్రియ చేపట్టాలని లేదంటే అధికారులు, జర్నలిస్టు యూనియన్ల ప్రతినిధులు , సీనియర్ పాత్రికేయులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

పేద మహిళల పాలిట పెద్దన్న కేసీఆర్

ఎమ్మెల్యే ముఠాగోపాల్


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పేద మహిళల పాలిట పెద్దన్న కేసీఆర్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం పేదింటి మహిళలకు ఎంతో ఆర్థికంగా ఊరటనిస్తుందని అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ మండలంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 7 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అన్నారు. ఆయన పేదల పక్షపాతి అని అధికారంలో లేకున్నా కేసీఆర్ పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌వో సంధ్యారాణి, బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, ముఠా నరేష్, కళ్యాణ్‌నాయక్, రాకేష్, వల్లాల శ్యామ్‌యాదవ్, ఉన్న సత్యనారాయణ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులకు ఆదర్శం జోగేంద్రనాథ్ మండల్


డాక్టర్ జోగేంద్రనాథ్ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మసమాజ్ పార్టీ నేతలు

కవాడిగూడ: నేటి రాజకీయ నాయకులకు జోగేంద్రనాథ్ మండల్ ఆదర్శమని, ఆయన అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం ఎంతో పోరాడారని ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా నాయకులు కృష్ణ మహారాజ్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ జోగేంద్రనాథ్ మండల్ 56వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణ మహారాజ్ మాట్లాడుతూ చట్టసభలలో దళిత బహుజనుల ప్రాతినిధ్యం ఉన్నప్పుడే ఆ వర్గాల ప్రజల హక్కులు కాపాడబడుతాయని ఆనాడే గుర్తించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. డాక్టర్ జోగేంద్రనాథ్ మండల్ స్ఫూర్తితోనే ధర్మసమాజ్‌పార్టీ ముందుకు సాగుతుందన్నారు. అణగారిన వర్గాల అందరిని ఏకంచేసి రాజ్యాధికారం వైపు మళ్లించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ధర్మసమాజ్ పార్టీ సీనియర్ నాయకులు జి. సంతోష్ మహారాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించడానికి అంబేడ్కర్‌కు పునాది వేసిన గొప్ప మహనీయుడు జోగేంద్రనాథ్ మండల్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మనోజ్, నాయకులు మహేష్, శ్రీధర్, శివ, ప్రసాద్, సంపత్, మురళీ, శ్రావణ్, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఆర్డర్‌ను రద్దు చేయాలి

మధ్యప్రదేశ్ విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ కూచిపూడి బాబురావు



కాచిగూడ: 1950 ఆగస్టు 10న రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డర్ రాజ్యాంగంలోని మౌలిక లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని, ఇది ప్రాథమిక హక్కులను హరించిందని ఈ ఆర్డర్‌ను వెంటనే రద్దు చేయాలని మధ్యప్రదేశ్ విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ కూచిపూడి బాబురావు డిమాండ్ చేశారు. వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాధ మాథ్యూ అధ్యక్షతన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చడంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని, కానీ ఈ ఆర్డర్ ద్వారా దళితుల హక్కులను దుర్వినియోగం చేశారన్నారు. ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ నియామకాల్లో మతం, కులం, జాతి, జన్మస్థానం వంటి అంశాలను ఆధారంగా తీసుకుని నియామకాలు నిరాకరించరాదని రాజ్యాంగం స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్రపతి ఆర్డర్ ద్వారా దళితులను మత ప్రాతిపదికన వేరు చేసి, విభజనలు సృష్టించడం దేశానికి మత ప్రాతిపదికన వేరు చేసి, విభజనలు సృష్టించడం దేశానికి మంచిది కాదన్నారు. క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ స్థాయి హోదా అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో మద్దతు తెలుపుతానని హామీ ఇచ్చారన్నారు. మతం కారణంగా రిజర్వేషన్లు కోల్పోయిన దళితుల న్యాయమైన డిమాండ్‌ను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందని, త్వరలో సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులను అంటరానివారిగా చూస్తే వారికి ప్రత్యేక దేశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం, డాక్టర్ సాధుసత్యనాథ్, బిషప్ సింగం, పులుగుజ్జు సురేష్, ముల్కల భాస్కర్, డాక్టర్ ఎడ్వర్డ్ శ్యాముల్, బ్రదర్ సుధాకర్, స్వరూప, లీలా, రెబెకా, ఈరేనా రోజ్, సునీత, శాంతి, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయిని పున:ప్రతిష్ఠించాలి


డీఎంసీకి వినతిపత్రం ఇస్తున్న అంబర్‌పేట దేవస్థాన ప్రతినిధులు

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రధాన రహదారిలో ఉన్న బొడ్డురాయి మందిరం పునః ప్రతిష్ఠించేందుకు సహకరించాలని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయన కార్యాలయంలో కలిసి బోడ్రాయి ఏర్పాటు చేసే స్థలంలో ఆక్రమణలు ఉన్నాయని, వాటిని తొలగించాలని డీఎంసీని కోరారు. దేవస్థాన సేవా సమితి అధ్యక్షులు శంకర్‌గౌడ్, ప్రతినిధులు శ్రీనివాస్‌ముదిరాజ్, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


నల్లకుంటలో సభ్యత్వ నమోదులో మాజీ కార్పొరేటర్ వనం రమేష్

నల్లకుంట: సుస్థిర భారత్ కోసం బీజేపీ సభ్యత్వం పొందాలని నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేష్ ప్రజలను కోరారు. శనివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 9,10లో బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదులో అయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మూడోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ నేతలు శ్యామ్‌రాజ్, సురేష్‌యాదవ్, ఎస్.రామ్‌జగదీష్ ముదిరాజ్, బ్రహ్మజీ, సత్యనారాయణ, చేతన్, రాహుల్‌సింగ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి సహకరించండి

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సహకరించాల్సిందిగా డివిజన్ కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను జోనల్ కమిషనర్‌తో చర్చించారు. బీఆర్‌ఎస్ నేతలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

కాకా సేవలు మరువలేం

జి. వినోద్‌కుమార్


జి.వెంకటస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వినోద్, సరోజావివేక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడానికి జి. వెంకటస్వామి (కాకా) చేసిన కృషి మరువలేమని అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో జి. వెంకటస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ విద్యాసంస్థలను స్థాపించి సుమారు లక్షా 50వేల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తనకంటూ ఒక ఉన్నత స్థానాన్ని సంపాదించి తెలంగాణ వచ్చాకే మరణించి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నారని అన్నారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అంబేడ్కర్ పేరును పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్, డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గాంధీనగర్‌లో 10వేల బీజేపీ సభ్యత్వాలను పూర్తి చేయాలి

కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్


సభ్యత్వ నమోదు చేస్తున్న పావని వినయ్‌కుమార్, నాయకులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో 10వేల బీజేపీ సభ్యత్వాలను లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ కోరారు. శనివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ బూత్‌నంబర్ 131,132,133లలో బీజేపీ సభ్యత్వాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ లో వ్యక్తులు మిస్డ్‌కాల్ ద్వారా, పార్టీ వెబ్‌సైట్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా సభ్యత్వ నమోదు చేయవచ్చునని తెలిపారు. ఈ సభ్యత్వానికి యువతి, యువకులు, వృద్ధుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయికుమార్, జ్ఞానేష్, ఆనంద్ రావు, బూత్ అధ్యక్షులు , సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ వేడుకల్లో అవంతి కళాశాల విద్యార్థినులు


న్యూఎరా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో




సుందరయ్యపార్కులో



కాచిగూడ: బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడుతూ.. సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ వీరసోమయ్య, డైరెక్టర్ (హెచ్‌ఆర్) డాక్టర్ జయప్రద తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో..

తెలంగాణ సాంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను చిక్కడపల్లిలో న్యూఎరా జూనియర్ కళాశాల విద్యార్థులు, సుందరయ్యపార్కులో జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు సంప్రదాయ వస్త్రాలు ధరించి బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. వారి ఆట పాటలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.